www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 9 జూన్ 2023



సచివాలయ సిబ్బందికి సూచనలు

ప్రజాశక్తి-నెల్లూరు : నగర పాలక సంస్థ పరిధిలోని స్థానిక 47/1, 47/2 గిడ్డంగి వీధి వార్డు సచివాలయాలను కమిషనర్ వికాస్ మర్మత్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయాలలోని ఇన్స్పెక్షన్ రిజిష్టరు, నోటీసు బోర్డు, హాజరు రిజిస్టరు, స్పందన రిజిష్టరులతో పాటు వివిధ సంక్షేమ పథకాల రికార్డులను పరిశీలించారు. పెండింగులో ఉన్న సేవలను గడువులోపు పూర్తి చేయాలని, సాంకేతిక అంశాలపై కార్యాలయం నుంచి నేరుగా సూచనలు పొందాలని సచివాలయాల కార్యదర్శులకు కమిషనర్ సూచించారు. స్థానిక కార్పొరేటర్ రామకష్ణ, రంగనాయకుల స్వామి గుడి ఛైర్మన్ శివాచారి, నగర పాలక సంస్థ వివిధ విభాగాల అధికారులు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న కమిషనర్

విద్యుత్‌తో దిన దిన గండం..!

- ◆టెక్నికల్ సమస్యతో జనం లబోదిబో
- ◆తెగిపడతోన్న విద్యుత్ వైర్లు
- ◆గంటల కొద్ది అంతరాయం

విద్యుత్‌తో ప్రాంత ప్రజలు అల్లాడిపోతున్నారు..సాంకేతిక లోపం కారణంగా ఎప్పుడు కరెంట్ ఉంటుందో, ఎప్పుడు పోతుందో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. భక్త వత్సలనగర్, పడారుపల్లి, ఎన్‌జిఒ కాలనీ, సుందరయ్య కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ వైర్లు తెగిపడిపోతున్నాయి.. 33 కెవి..11 కెవి సబ్ స్టేషన్ ఫీడర్స్‌లో టెక్నికల్ సమస్యలు వస్తున్నాయి. గంటల కొద్ది విద్యుత్‌కు అంతరాయం కలుగుతోంది. వేసవి కావడం, భారీగా ఉష్ణోగ్రతలుండడంతో కరెంట్ రాక తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. ఓ వైపు విద్యుత్ శాఖ అధికారులు, లైన్‌మెన్స్ ఎండల్లో అల్లాడి పోతుండగా, ప్రజలు ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నారు. అధికారులు తూతూ మంత్రంగా చర్యలు తీసుకుంటుండడంతో మళ్లీ మళ్లీ సమస్యలు వస్తున్నాయి.. రాత్రి, పగలు తేడా లేకుండా ఈ ప్రాంత ప్రజలు కష్టాలు పడుతున్నారు..

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం గుట్టుచప్పుడు కాకుండా విద్యుత్ వినియోగదారులపై ఛార్జీలతో బాదుతున్నారు. ఎన్ని ఇబ్బందులు పడుతున్నా బిల్లులు చెల్లిస్తున్నారు. జిల్లా వ్యాపితంగా 8.5 లక్షల గృహ వినియోగదారులు, 96 వేల వ్యవసాయ కనెక్షన్లు, 25 వేల వరకు కమర్షియల్ వినియోగ దారులున్నారు. వేసవి ఎక్కువగా ఉండడం, ఎక్కువ విద్యుత్ వినియోగిస్తున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు ఎండ వేడిమిని తట్టుకోలేక కష్టాలు పడుతున్నారు. ఒకప్పుడు ఏసి హోదాగా భావించిన జనం ఇప్పుడు అవసరంగా చూస్తున్నారు. అందుకు అప్పులు చేసి, ఏసిలు ఎక్కువమంది వినియోగిస్తున్నారు. విద్యుత్ వినియోగం పెరగడంతో అందుకు అనుగుణంగా ఆశాఖ ఏర్పాట్లు చేయకపోవడంతో తరచూ కరెంట్ సమస్యలు వస్తున్నాయి. భక్తవత్సలనగర్, పడారుపల్లి, ఎన్‌జిఒ కాలనీ, సుందరయ్య కాలనీ, చలపతి, చెంచయ్య నగర్ తదితర ప్రాంతాల్లో నిత్యం కరెంట్ సమస్యలు జనం ఎదుర్కొంటు న్నారు. ఇదేదో ప్రజల సమస్యే కాదు. ఆ ప్రాంతంలో పనిచేసే విద్యుత్ అధికారులు, లైన్ మెన్స్‌కు ఇబ్బందులు తెచ్చిపెడు తోంది..ఎప్పుడు కరెంట్ పోతుంది, ఎవరు ఫోన్ చేస్తారోనని ఆందోళన చెందుతున్నారు. 32 కెవి, 11 కెవిల్లో ఫీడర్స్ దెబ్బతింటున్నాయి. ఇక్కడ ఉన్న సాంకేతిక సమస్యపై ఎంఆర్‌టి కమిటీ ఫిర్యాదు చేశారు. సబ్ స్టేషన్లు పరిధిలోనూ సమస్యలు వస్తున్నాయి. ఎక్కువ కరెంట్ వాడుతుండడంతో ఫీడర్స్ దెబ్బతింటున్నాయని తెలుస్తోంది. ఎప్పుడో పాత పరికరాలు ఉండడంతో దాంతో ప్రస్తుత లోడ్ అధికమించలేకపోతున్నారని తెలుస్తోంది. అధికారులు, ఉన్నతాధికారులు సమస్య తెలిపినా పరిష్కారం దొరకడం లేదు. ఎప్పుడు ఎక్కడ ఏ సమస్య వస్తుందోననే ఆందోళన అటు అధికారులు, ఇటు ప్రజల్లో కనిపిస్తుంది.

కరెంట్‌తో దినదిన గండం..!

నెల్లూరు నగరంలోని పలు ప్రాంతాల్లోని సబ్ స్టేషన్లు పరిధిలో విద్యుత్ సమస్యలు ఎక్కువవుతున్నాయి. ఇటీవల కాలంలో ప్రతి రోజూ కరెంట్ సమస్యతో భక్తవత్సలనగర్, పడారుపల్లి, ఎన్‌జిఒ కాలనీ, చలపతి, చెంచయ్య నగర్‌తోపాటు అనేక ప్రాంతాల్లో ఈ సమస్య ఉంది. కేవలం 10 రోజుల వ్యవధిలో జరిగిన సంఘటనలు దీని తీవ్రతను తెలియజేస్తుంది.

తెగిపడిన విద్యుత్ తీగ

ఓరోజు మధ్యాహ్నం 12 గంటలకు పోయింది. సాయంత్రం 7 గంటలకు పునరుద్ధరించారు. పడారుపల్లి ప్రాంతంలో విద్యుత్ వైర్లు తెగిపోయాయి. మరో రోజు ఒక లారీ తీగలను తెంచి వేయడంతో మూడు గంటలు కరెంట్ నిలిచిపోయింది. గత నెల 30 వతేది రాత్రి 11.45 నిమిషాలకు విద్యుత్‌కు అంతరాయం కలిగింది. ఉదయం 6.30 గంటలకు కరెంట్ తిరిగి ఇచ్చారు. ఈ ప్రాంత ప్రజలు ఇళ్లలో ఉండలేక వీధుల్లోకి వచ్చి జాగారం చేశారు. మరో రోజు మధ్యాహ్నం 12 గంటలకు విద్యుత్‌కు అంతరాయం కలిగింది. సాయంత్రం 5 గంటలకు తిరిగి ఇచ్చారు. తరచూ కరెంట్ తీగలు తెగిపడిపోతున్నాయి. పడారుపల్లి ప్రాంతంలో రెండు తీగలు తగిలి నిప్పురవ్వలు రావడంతో ఓ బాలికకు గాయాలయ్యాయి. గురువారం మధ్యాహ్నం 11 గంటలకు కరెంట్ పోయి, మధ్యాహ్నం 3.30 గంటలకు తిరిగి వచ్చింది. మళ్లీ అవే సమస్యలతో జనం గగ్గోలు పెడుతున్నారు. తీవ్రమైన ఎండకాలంలో ఇలా తరచూ విద్యుత్‌లో సాంకేతిక సమస్యలు వస్తున్నాయి. ఎండల్లో, రాత్రి సమయంలో విద్యుత్ ఇబ్బంది ప్రాణాలకు తెగించి పనిచేయాల్సి వస్తుందని, ఓ అధికారి తెలిపారు. సాంకేతిక సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. ఏదేమైనా సాంకేతిక సమస్యలు ఈ ప్రాంత ప్రజలను కంటిమీద కునుకు పెట్టనివ్వడం లేదు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని పునరుద్ధరించకపోతే తీవ్రమైన నష్టం జరిగేలా కనిపిస్తోంది. విద్యుత్ వైరు తెగి వాహనాలు, మనుషులపై పడితే ప్రాణ నష్టం జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పడారుపల్లిలో విద్యుత్ పునరుద్ధరణలో ఉద్యోగులు (ఫైల్)

కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

హెల్త్ అలవెన్స్ బకాయిలు చెల్లించాలి

కార్పొరేషన్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-నెల్లూరు

మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం చెల్లించాల్సిన హెల్త్ అలవెన్స్ బకాయిలను తక్షణమే చెల్లించాలంటూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రూరల్ కమిటీ డిమాండ్ చేసింది. గురువారం నగరంలోని కార్పొరేషన్ కార్యాలయం ఎదుట తమ సమస్యలను పరిష్కరించాలంటూ నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తొలుత దర్గా నుండి ర్యాలీగా వెళ్లి కార్పొరేషన్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు. మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె. పెంచల నరసయ్య, సిఐటియు రూరల్ కార్యదర్శి కిన్నెర కుమార్ మాట్లాడారు. కార్మికులుగా పనిచేస్తూ మృతిచెందని వారికి మట్టి ఖర్చులు, ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.మున్సిపల్ కార్మికుల యొక్క సమస్యలు పరిష్కారం చేయాలని గత కొన్ని రోజులుగా అధికారులు దష్టికి తీసుకు వెళుతున్న ఏ ఒక్క సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. గత రెండు నెలల నుండి హెల్త్ అలవెన్స్ బకాయిలు పెండింగులో ఉన్నాయన్నారు. విధి నిర్వహణలో ఉండి చనిపోయిన కార్మికులకు కనీసం మట్టి ఖర్చులు ఎక్స్ గ్రేషియా కూడా ఇవ్వటం లేదన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. నేటి సాయంత్రం 5 గంటలకు సమావేశం నిర్వహించి కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు సుజాతమ్మ, దేశ మూర్తి, సిఐటియు నాయకులు బత్తల కిష్టయ్య, సంపత్ పాల్గొన్నారు.

మొరాయించిన సర్వర్లు

ప్రజాశక్తి-గుడ్లూరు : గుడ్లూరులోని కెనరాబ్యాంకులో సర్వర్లు పని చేయక పోవడంతో వందలాది మంది ఖాతాదారులు ఇబ్బందులు పడుతున్నారు. గుడ్లూరులో ఇటీవల తరచుగా సర్వరు పని చేయకపోవడంతో పనులు ఆగిపోతున్నాయి. పొదుపు సంఘాల మహిళల లావాదేవీలు జరపటానికి వీలులేకుండా పోయింది. దీంతో ఖాతా దారులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ బ్యాంకు ఆవరణలో వేచి ఉంటున్నారు. సర్వర్ ఎప్పుడు పని చేస్తుందో తమకేమీ తెలియదని బ్యాంకు ఉద్యోగులు చెబుతున్నారు. దీంతో మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన బ్యాంకు ఖాతాదారులు పడికాపులు కాస్తున్నారు. సర్వర్ పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఖాతాదారులు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

సభను జయప్రదం చేయండి : ఎంఆర్‌పిఎస్

ప్రజాశక్తి - కందుకూరు : మాదిగల జనజాగృతి సభ కరపత్రాన్ని ఎంఎఆర్‌పిఎస్ ప్రకాశం జిల్లా అధ్యక్షులు రావినూతల కోటి మాదిగ గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కోటి మాట్లాడుతూ జూలై 7న విజయవాడ జింఖానా గ్రౌండ్‌లో జరిగే మాదిగల జనజాగృతి సభ జరుగుతుందన్నారు. అందులో భాగంగా 14న కందు కూరులో జరగనున్న సన్నాహ సభకు ముఖ్య అతిథులుగా ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ హాజరవుతారన్నారు. జిల్లా కో-కన్వీనర్ అత్యాల శరత్ మాదిగ,మరియదాస్ మాదిగ,మహేష్ మాదిగ,సురేష్ మాదిగ పాల్గొన్నారు.

సచివాలయంలో తనిఖీ

ప్రజాశక్తి - లింగసముద్రం : మండలంలోని ముత్యాలపాడు, చినపవని, అన్నెబోయినపల్లి, విఆర్ కోట గ్రామ సచివాలయాలను ఎంపిడిఒ శేషుబాబు గురువారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. సకాలంలో విధులకు హాజరు కావాలని, ప్రజలకు మెరుగైన సేవలందించాలని అందరూ యూనిఫాం ధరించాలని సూచించారు.

నారాయణరెడ్డికి పరామర్శ

ప్రజాశక్తి - కందుకూరు : ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లో విశ్రాంతి తీసుకుంటున్న మార్కాపురం మాజీ ఎంఎల్‌ఎ కందుల నారాయణరెడ్డిని గురువారం కందుకూరు నియోజ కవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ దివి శివరాం పరామర్శించారు. వారు నారాయణరెడ్డి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.

ఎంఎల్‌ఎకు స్వాగతం

ప్రజాశక్తి - కందుకూరు : కందుకూరు పట్టణంలోని నందా వారి వీధిలో ఉన్న జియో ఫైబర్ నెట్ కార్యాలయాన్ని ఎంఎల్‌ఎ మానుగుంట మహీధర్‌రెడ్డి గురువారం ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయనకు నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. నిర్వహకులు పూనాటి కాంతారావు, పబ్బిశెట్టి శివ,మాజీ ఎఎంసి ఛైర్మన్ తోకల కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

సముద్ర జలాలను పరిరక్షించుకుందాం..

ప్రజాశక్తి-నెల్లూరు

సముద్ర జలాలను కలుషితం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత మన అందరి పై ఉందని అదాని కష్ణపట్నం పోర్ట్ సి ఒఒ సంజయ్ కోత పిలుపునిచ్చారు.గురువారం ప్రపంచ 'ఓ షన్ డే' సందర్భంగా అదాని కృష్ణపట్నం పోర్ట్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సముద్ర జలాలు నుంచే ఎక్కువ శాతం ఆక్సిజన్ అందుతుందని తెలిపారు.సముద్ర జలాలను కలుషితం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉన్నదన్నారు. పోర్ట్ ఆధ్వర్యంలో 5 ఫైబర్ బోట్స్ ద్వారా సముద్ర జలాలలోని చెత్త ,చెద రాలను ఈ రోజు ప్రత్యేక డ్రైవ్ ద్వారా తొలగించే కార్యక్రమాన్ని పోర్ట్ సి ఓ ఓ జెండా ఊపి ప్రారంభించారు. కష్ణపట్నం పోర్ట్ పరిధి లోని సముద్ర జలాలను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు కలిగి ఉండేలా అదాని కష్ణపట్నం పోర్టు కృషి చేస్తుందన్నారు. సముద్ర జలాలు పర్యావరణ పరిరక్షణ కోసం కషి చేస్తామని పోర్ట్ ఉద్యోగులు,కార్మికులు, ప్రతిజ్ఞ చేసి మొక్కలు నాటారు. కోస్ట్ గార్డ్ డిప్యూటి కామాండ్ గిరీష్ కుమార్,మెరైన్ హెడ్ కెప్టెన్ పాడియా, ,ఆడ్మిన్ హెడ్ గణేష్ శర్మ,సెక్యూరిటీ హెడ్ వెంకటేష్ భాస్కరన్, ఎమ్ విజయ్, మనీష్ దావే,పోర్ట్ కొంట్రోల్ ఇంచార్జ్ జునీద్, గంగా సతీష్, మనోహర్ బాబు, హర్షవర్ధన్ భానుప్రకాష్, వేణుగోపాల్ రెడ్డి, సైఫీ, వివిధ విభాగాలు హెచ్వోడీలు ఉద్యోగులు కార్మికులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలందించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందని, ఇందుకనుగుణంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో ప్రజలకు నమ్మకం, భరోసా కల్పించేలా వైద్యులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ ఎం హరి నారాయణన్ సూచించారు. గురువారం కలెక్టర్ తన చాంబర్లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలల్లో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది నిర్దిష్టమైన సమయ పాలన పాటిస్తూ అటెండెన్స్ తప్పనిసరిగా వేయాలన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులతో అమర్యాదగా మాట్లాడడం, నిర్లక్ష్యం ప్రదర్శించకుండా వారిని గౌరవించి, వైద్య సేవలు సకాలంలో అందించాలని సూచించారు. కేవలం అటెండెన్స్ వేయడం మాత్రమే కాకుండా కిందిస్థాయి సిబ్బంది ఎలా పనిచేస్తున్నారో వైద్యాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆస్పత్రుల్లోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా పారిశుద్ధ్య సిబ్బంది చేత సక్రమంగా పనిచేయించాలని చెప్పారు. ఆసుపత్రుల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బంది నియామకం చేపట్టిందన్నారు. ప్రధానంగా ఆసుపత్రులకు వచ్చే రోగులకు ప్రభుత్వ వైద్యశాలలపై నమ్మకం, భరోసా కల్పించేందుకు వైద్యులు, సిబ్బంది తమ వంతు కృషి చేయాలన్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల సమన్వయకర్త రమేష్ నాథ్, డి ఎం హెచ్ ఓ వెంకటప్రసాద్, వైద్యాధికారులు, ప్రోగ్రాం ఆఫీసర్లు, సూపరిం టెండెంట్లు తదితరులు పాల్గొన్నారు. జిజిహెచ్ లో లిఫ్టులు, ఏసీల పనితీరుపై సమీక్ష జరిపారు. జి జి హెచ్ సూపరింటెండెంట్ సిద్ధా నాయక్, ఎపి ఎమ్మెస్ఐడిసి ఈఈ కె ఉమా శంకర్, డిఇ సాంబశివరావు ఉన్నార.

మాట్లాడుతున్న కలెక్టర్ ఎం హరినారాయణన్

అపోలో, మెడికవర్ ఆస్పత్రుల్లో

బ్రెయిన్ ట్యూమర్ నివారణపై అవగాహన

ప్రజాశక్తి-నెల్లూరు : అపోలో వైద్యశాలలో మెదడు సంబంధీత వ్యాధుల నివారణకు అత్యాధునిక వసతులతో కూడిన ఆధునిక వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని సీనియర్ న్యూరో సర్జన్లు డాక్టర్ వి.కె.ఆనంద్, డాక్టర్ రమణమూర్తి పేర్కొన్నారు. గురువారం వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డే ని పురస్కరించుకొని నగరంలోని అపోలో స్పెషాలిటీ హాస్పటల్ లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అపోలో ఆస్పత్రి సీనియర్ న్యూరో సర్జన్లు డాక్టర్ వి. కే.ఆనంద్, డాక్టర్ రమణమూర్తి మాట్లాడుతూ మెదడులోనే మొదలై పెరిగే కణితులను వైద్యభాషలో ప్రైమరీ బ్రెయిన్ ట్యూమర్స్ అని పిలుస్తారన్నారు. శరీరంలోని ఇతర భాగాల నుంచి మెదడుకి వ్యాపించే కణితులు భిన్నంగా ఉంటాయని, వాటిని సెకండరీ బ్రెయిన్ ట్యూమర్స్ అని పిలుస్తారన్నారు. మెదడు కణితులు చిన్న పరిమాణం నుండి పెద్ద పరిమాణంలో ఉంటాయని, వాటిల్లో కొన్ని చిన్నవిగా ఉన్న సమయంలో కనిపిస్తాయన్నారు మెదడులోని కణుతులు తక్కువగా చురుగ్గా ఉంటే వెంటనే లక్షణాలను గుర్తించవచ్చున్నారు. ఇటువంటి కణితుల్లో ఏవి ప్రమాదకరమైనవి, ఏవి ప్రమాధకరమైనవి కావో వివరించారు. కొన్ని లక్షణాలను చూస్తే...తలనొప్పి, మూర్ఛ, అనారోగ్యం, వికారం, వాంతులు, నీరసం, మానసిక సమస్యలు, జ్ఞాపకశక్తి తగ్గడం, పక్షవాతం, చూపు, వినికిడి సమస్యలు అనారోగ్యానికి గురౌతుంటారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా మరణాలకు ప్రధాన కారణాల్లో బ్రెయిన్ ట్యూమర్ కూడా ఓ కారణం. మెదడులో కణితిని అనుమానిస్తే, ఏదైనా నాడీ సంబంధిత మార్పులను గమనిస్తే ముందుగా డాక్టర్‌తో పరీక్షలు నిర్వహించు కోవాలన్నారు .న్యూరోలాజికల్ టెస్ట్, హెడ్ సిటి స్కాన్, మెదడు ఎమ్ఆర్ఐ, మెదడు పీఈటీ స్కాన్, బయాప్సీ వంటివి బ్రెయిన్ ట్యూమర్‌ని గుర్తించే మార్గాలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయన్నారు. సద్వినియోగ చేసుకోవాలని కోరారు. న్యూరో సర్జన్లు డాక్టర్ యశ్వంత్ సందీప్, డాక్టర్ ఉబేద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అపోలో వైద్యులు

'మెడికవర్'లో...

ప్రతి వ్యక్తి తలనొప్పి ,బ్రెయిన్ ట్యూమర్ వంటి సమస్యలు రాకుండా ముందు జాగ్రత్తగా వైద్యులను సంప్రదించి సూచనలు, సలహాలు తీసుకొని ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడవచ్చని ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ దీక్షంతి నారాయణ్ అన్నారు. నెల్లూరు మెడికవర్ హాస్పిటల్స్‌లో గురువారం నిర్వహించిన "ప్రపంచ బ్రెయిన్ ట్యూమర్ డే" కార్యక్రమంలో పాల్గొని 'కేక్ కటింగ్' చేసి అనంతరం జరిగిన అవగాహన సదస్సులో ఆమె పలు విషయాలను ప్రస్తావించారు. ఇంకా న్యూరో సర్జన్ డాక్టర్ దినేష్ గంగపట్నం మాట్లాడుతూ మెదడులో గడ్డల వల్ల ఎదురయ్యే సమస్యలు, అందుబాటులో ఉన్న చికిత్సలను గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తలనొప్పి, తలలో ఒత్తిడి,ఉదయం సమయంలో తీవ్రమైన తలనొప్పి, పడు కున్నప్పుడు ఎక్కువగా ఉండడం,వికారం, వాంతులు ఏవైనా రెండుగా కనిపించడం ఈ వ్యాధికి సాధారణ లక్షణాలన్నారు. న్యూరాలజిస్ట్ డాక్టర్ వైష్ణవి, న్యూరో సర్జన్ డాక్టర్ ధీరజ్, ఎమర్జెన్సీ డిపార్ట్మెంట్ హెడ్ డాక్టర్ కష్ణ చైతన్య, ఇంటెన్సివ్ కేర్ డాక్టర్ రాజేష్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ మహేశ్వర్ రెడ్డి, సెంటర్ హెడ్ డాక్టర్ గణేష్ నాగిరెడ్డి ఉన్నారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి -నెల్లూరు

కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణ, సిపిఎస్ స్థానంలో జిపిఎస్ తీసుకరావడం వంటి సాహోసపేత నిర్ణయాలను ఎపి కేబినెట్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తీసుకోవడం సంతోషకరమని ఎంఎల్‌సి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ అధ్యాపకులతో కలిసి ఆయన కేక్ కటింగ్ చేశారు. అనంతరం సిఎం చిత్రపటానికి లెక్చరర్లతో కలిసి చంద్రశేఖర్ రెడ్డి పాలాభిషేకం చేశారు. ఎంఎల్‌సి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారు 10 వేల మందికి పైగా కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించడం సాహసోపేత నిర్ణయమని కొని యాడారు. డివి ఈ ఒ మధుబాబు, ఆర్ ఐ ఒ వరప్రసాద్ రావు, రెగ్యులర్ అసోసి యేషన్ ప్రెసిడెంట్ గురవయ్య, కాంట్రాక్ట్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సునీల్ శర్మ తదితరులు ఉన్నారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎంఎల్‌సి

వడదెబ్బకు ఇద్దరు మృతి

ప్రజాశక్తి-గుడ్లూరు : సెగగాలులు వీయడంతో గుడ్లూరుకు చెందిన చిలుకూరు పాటి గోవిందయ్య (70), గుడ్లూరు ఎస్‌సి కాలనీకి చెందిన బొమ్మల రాఘవులు (70) మృతిచెందారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు తెలిపారు. వేడిగాలులు వీయడంతో వృద్ధులు, చిన్నారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. జూన్ నెల వచ్చినా సెగ గాలులు తగ్గకపోవడంతో జనం ఇళ్లకే పరిమితమవుతున్నారు. వడగాలులకు మరణించిన వృద్ధులకు ప్రభుత్వం ఆర్థికం సాయం అందించాలని బంధువులు కోరుతున్నారు.

'నారాయణ'లో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి-నెల్లూరు : నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం "బజాజ్‌అలయన్స్" సంస్థ ప్రాంగణ ఎంపికలు నిర్వహించిందని కళాశాల మేనేజ్మెంట్ సెక్రటరీ వై. వినయ్ కుమార్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు వార్షిక వేతనం కింద రూ.5.9 లక్షల లభిస్తుం దని ఆయన తెలిపారు. పుణే నుంచి బజాజ్ అలయన్స కంపెనీ లిమిటెడ్ ప్రతినిధిలు అరుణ్ మిశ్రా, స్వర్ష్ జైన్ మాట్లాడుతూ 250 మంది ఆంధ్రప్రదేశ్ తెలంగాణ, కర్ణాటక నుండి విద్యార్థులు ప్రాంగణ ఎంపికలకు హాజరైనారన్నారు. కోవిడ్ అనంతరం మార్కెట్లో జరిగే ఫ్లెక్చువేషన్ కు అనుగుణంగా ఎన్నో మార్పులు ఇన్సూరెన్స్ రంగంలో చేశామని, తద్వారా ఉద్యోగ అవకాశాలు మిండుగా ఉన్నాయని దానికి సంబంధించిన పరిజ్ఞానాన్ని ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని అరుణ్ మిశ్రా తెలిపారు.కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ జి. శ్రీనివాసులు రెడ్డి ఎంబీఏ డిపార్ట్మెంట్ డీన్ డాక్టర్ గంగినేని ధనుంజయ్, ప్లేస్మెంట్ అధికారులు పాల్గొన్నారు. 40 మంది ఉత్తీర్ణత సాధించారని కంపెనీ ప్రతినిధులు తెలిపారు.

పారిశుధ్య నిర్వహణకు సహకరించాలి

ప్రజాశక్తి-నెల్లూరు : క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యాచరణలో భాగంగా నెల్లూరు నగర పాలక సంస్థ ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తున్న డోర్ టు డోర్ చెత్త సేకరణలో తడి, పొడి చెత్తను విడివిడిగా అందించి మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు ప్రజలంతా బాధ్యతగా సహకరించాలని కమిషనర్ వికాస్ మర్మత్ పిలుపు నిచ్చారు. గురువారం పారిశుద్ధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 11, 13, 14, 16 డివిజనుల్లో జరుగుతున్న చెత్త సేకరణ పనులను ఆయన పర్యవేక్షించారు. డ్రైను కాలువల్లో క్రమంతప్పకుండా పూడికతీత పనులను చేపట్టాలని, సిల్టు వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. వీధుల్లోని లిఫ్ట్ పాయింట్ల వద్దనుంచి చెత్తను సేకరించవద్దని, కచ్చితంగా డోర్ టు డోర్ చెత్త సేకరణ మాత్రమే జరిగేలా పర్యవేక్షించాలని, డివిజను పరిధిలో అపరిశుభ్రంగా ఉన్న ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి నోటీసులు జారీ చేయాలని శానిటేషన్ కార్యదర్శులను ఆదేశించారు. పెద్ద డస్ట్ బిన్ లను అపార్ట్మెంట్ వాసులంతా వినియోగించేలా అవగాహన కల్పించి అపార్ట్మెంట్ ప్రాంగణాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

భూ రీ సర్వే ప్రారంభం

ప్రజాశక్తి-నెల్లూరు : వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజనుల్లో జరగనున్న రీ సర్వే పనులలో అత్యాధునిక డిజిటల్ డ్రోన్ సేవలను వినియోగించుకుని రీ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ అధికారులను ఆదేశించారు. నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు, డ్రోన్ ఏజెన్సీ బందంతో స్థానిక పోలీసు పెరేడు మైదానంలో డ్రోన్ ఫ్లై రీ సర్వేను కమిషనర్ గురువారం ప్రారంభించారు. కమిషనర్ మాట్లాడుతూ నేటినుంచి జరగనున్న డ్రోన్ ఫ్లై భూసర్వే లో నగర పాలక సంస్థ పరిధిలో 154 చ.కిమీ మేరకు రీ సర్వే చేయనున్నామని తెలిపారు. నగర పాలక సంస్థ పరిధిలో ఆస్తి కలిగిన ప్రతిఒక్కరికీ రీ సర్వే ఆధారిత శాశ్వత భూహక్కు పత్రాలను అందజేస్తామని, భవిష్యత్తులో ఆస్థి క్రయవిక్రయాలను సులభతరం చేసేందుకు ఆయా పత్రాలు ఉపయుక్తంగా ఉంటాయని తెలిపారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, టౌన్ ప్లానింగ్ అధికారులు, సర్వేయర్లు, రీ సర్వే తహశీల్దార్, సచివాలయాల వార్డు ప్లానింగ్ కార్యదర్శులు, డ్రోన్ ఏజెన్సీ నిర్వాహకులు కష్ణ చైతన్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఈకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి - కందుకూరు : స్థానిక ట్రెజరీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఎస్‌టిఒ ఆర్.జగజీవన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిఒ నెంబర్7 మేరకు ట్రెజరీ పరిధిలోని 2,140 మంది పెన్షనర్లలో 1710 మంది పెన్షనర్లు ఈకెవైసి చేయిం చుకున్నారని, మిగిలిన 430 మంది వెంటనే ఈకెవైపి చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమం కోసం రెండో శనివారం కూడా కార్యలయం పని చేస్తుందన్నారు. నాయకులు చిమ్మిరి నరసింహం,రాంబాబు, సిబ్బంది జగదీష్,ఎలిజిబెత్ రాణి ఉన్నారు.

259 మందికి వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-ఉదయగిరి:అప్పసముద్రంలో 259 మందికి కాకర్ల సంజీవని ఆరోగ్య రథంలో వైద్యులు ఉచిత వైద్యం అందించారు. గురువారంమండల పరిధిలోని అప్పసముద్రంలో కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సంజీవిని ఆరోగ్య రథంతో ఉచిత వైద్య శిబిరం ను గ్రామంలోని మహాలక్ష్మి గుడి ఆవరణలో వైద్య శిబిరం ఏర్పాటుచేసి వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 160 మందికి వైద్యులు అవసరమైన ఈసీజీ రక్త పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. మరో 99 మందికి కంటి పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేసి సలహాలు సూచనలు డాక్టర్ ఇచ్చారు. ఈ సందర్భంగా కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ అధినేత నియోజకవర్గ తెలుగుదేశం నాయకులు కాకర్ల సురేష్ కు గ్రామస్తులు కతజ్ఞతలు తెలిపారు. 41వ రోజు అన్న క్యాంటీన్ ద్వారా 550 మంది తమ ఆకలిని తీర్చుకొన్నారని 59వ రోజు చలివేంద్రం ద్వారా 770మంది తమ దాహాన్ని తీర్చుకున్నారని నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో కాకు వెంగళరావు యాదవ్, మానుకొండ వెంకటేశ్వర్లు, మద్దినేని మాలకొండయ్య, చల్ల గొలుసు వెంకటయ్య, రమణయ్య,కళ్లకుంట రమణారెడ్డి, వేలమూరి ఎర్రారెడ్డి, భాస్కర్.కాకు వెంకటేశ్వర్లు ఈర్ల ప్రసాద్, వెంగళరావు పాల్గొన్నారు.

వద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

రక్తదానంపై అవగాహన

ప్రజాశక్తి-కావలి:ప్రపంచ రక్తదాతల దినోత్సవాలను పురస్కరించుకొని టీం సేవియర్స్ ఆధ్వర్యంలో గురువారం పలు ప్రాంతాలలో రక్తదానంపె ప్రచారం నిర్వహించారు.వట్టణంలోని అట్టలఫ్యాక్టరీ కాలనీలోని అన్నీ వీధుల్లో యువకులను సమీకరించి రక్తదానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టీం సేవియర్స్ మహిళా విభాగం చైర్మన్ కీర్తి మాట్లాడుతూ రక్తదానం చేయడానికి సాధారణ ఆరోగ్యం, సాటి ప్రాణాన్ని కాపాడాలనే హృదయం చాలని అన్నారు. రక్తదానానికి పేదరికం అడ్డుకాదని, కావలి పట్టణానికి చెందిన ప్రముఖ రక్తదాత లందరు పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన వారెనని వివరించారు. ఈసందర్భంగా పలువురు యువతీ యువకులు రక్తదాతలుగా తమ పేరు నమోదు చేయించుకున్నారు. కార్యక్రమంలో మేఘన, దీపిక, ప్రేక్ష, సుజిత్, ప్రణయ్, మహేష్, రమణ్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

ప్రజాశక్తి-విడవలూరు:మండల పరిధిలోని ముదివర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ ముదివర్తి గ్రామంలో రూ.24.45 లక్షలతో నూతనంగా నిర్మించిన గోడౌన్, స్ట్రాంగ్ రూమ్, వాష్ రూములు గురువారం కోవూరు శాసనసభ్యులు నలపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదివర్తి గ్రామంలో ఎఫ్‌డిఆర్ నిధులు రూ.40లక్షలతో బి.సి. కాలనీ వద్ద నూతనంగా నిర్మించిన ఊర కాలువకు గోడలను కొండూరు వెంకటసుబ్బారెడ్డి, కొండూరు లక్ష్మీనారాయణ రెడ్డి,డి సి ఎం ఎస్ చైర్మన్ వీరి చలపతిరావు ప్రారంభించారు. ముదివర్తి గ్రామం అభివద్ధి చేప ట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్ రెడ్డి, కోటంరెడ్డి నవీన్ రెడ్డి, పుండ్ల అచ్యుత్ రెడ్డి, రామిరెడ్డి విజయ్ భాను రెడ్డి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.


సన్మానిస్తున్న ఎంఎల్‌ఎ నల్లపురెడ్డి ప్రసన్న

ప్రపంచ ఆహార భద్రత దినోత్సవం

ప్రజాశక్తి-ఉదయగిరి:ఫడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆంధ్రప్రదేశ్ వాలంటరీ హెల్త్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ ఆహార భద్రత దినోత్సవం శకునాలపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని శకునాలపల్లి పంచాయతీ సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ వాలంటరీ హెల్త్ అసోసియేషన్ ప్రపంచ ఆహార భద్రత దినోత్సవంలో భాగంగా కరువు జల వనరులపై అవగాహన సదస్సును పంచాయతీ కార్యదర్శి కరీముల్లా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సదస్సుకు ఫడ్స్ డైరెక్టర్ పివి రమణయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని ఆహార భద్రత చట్టం కరువు జనం జల వనరుల వినియోగం తక్కువ నీటితో జొన్న, మొక్కజొన్న, రాగి, సజ్జ, మినుము, కొర్ర మొదలగు పంటలను పండించడంతో ఆహార భద్రత వస్తుందని వివరించారు. మందులు లేని సేంద్రియ ఎరువులతో పంటలు పండించి ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విఆర్ఓ అనూష, పులాయిపల్లి పంచాయతీ కార్యదర్శి వెల్ఫేర్ అసిస్టెంట్ ముద్దీన్, వెటర్నరీ అసిస్టెంట్ కిషోర్, పంచాయతీ సచి వాలయ సిబ్బంది, వాలంటరీలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఫడ్స్ డైరెక్టర్ పివి రమణయ్య

ఎంఇఒకు వినతి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్:నిబంధనలకు విరుద్ధంగా వేసవి సెలవులలో ప్రయివేట్ పాఠశాలల్లో తరగతులను నిర్వహించడాన్ని వ్యతిరేకిస్తూ గురువారం ఎంఈఓ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు బాలాజీ మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణంలో వేసవి సెలవులలో పలు ప్రయివేట్ పాఠశాలల్లో తరగతులను నిబంధనలకు విరుద్ధంగా కొనసాగించడం సరైనది కాదన్నారు. విద్యార్థులను బలవంతంగా కొన్ని పాఠశాలలు జూన్ రెండవ తేదీ నుంచి తరగతులు నిర్వహిస్తున్నారు. ఎండలకు విద్యార్థులకు వడదెబ్బ బారిన పడుతున్నారన్నారు. యాజమాన్యాల తమ సొంత ప్రయోజనాల కోసం విద్యార్థులను మానసిక ఒత్తిడి గురి చేస్తే ప్రయివేట్ పాఠశాలల్లో యాజమాన్యాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం కాపాడాలని కోరారు. అదేవిధంగా ప్రయివేట్ పాఠశాలలు యాజమాన్యం విద్యార్థులను మార్కులు తెచ్చే యంత్రంగా మార్చడం అది సరైనది కాదన్నారు. ప్రైవేట్ పాఠశాల యాజమాన్యంపై అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలకు చేపడతామని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాలాజీ , ఖాదర్ బాషా, జస్వంత్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-జలదంకి:అన్నవరం పంచాయతీ కార్యదర్శిగా రేవతి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న రామకష్ణ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఈమె పూర్తిగా ఛార్జ్ తీసుకున్నారు. నెల్లూరు రూరల్ మండలం, ములుమూడి పంచాయతీలో విధులు నిర్వహిస్తూ ఇక్కడికి వచ్చారు.మండల ఉపాధ్యక్షులు పాలవల్లి మాలకొండా రెడ్డి, గుమ్మిడి రమేష్ ,సర్పంచ్ గుమ్మడి మార్తమ్మ సమక్షంలో బాధ్యతలు చేపట్టారు. .ప్రజలకు అందుబాటులో ఉంటూ పంచాయతీ అభివద్ధికి ప్రభుత్వ ఆదేశాలకు కట్టుబడి పని చేస్తానని తెలిపారు. పంచాయతీలోని సమస్యలను తన దష్టికి తీసుకొని వస్తే పై అధికారుల సూచనల మేరకు అభివద్ధికి కషి చేస్తానన్నారు. ప్రజలకు నిరంతరం సహాయ సహకారాలను అందజేస్తానని తెలిపారు.కార్యక్రమంలో ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, వాలంటీర్లు ,సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యా కానుక కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-ఉదయగిరి:జగనన్న నాలుగో విడత విద్యా కానుక కిట్లు పంపిణీ పూర్తయినట్లు మండల విద్యాశాఖ అధికారి షేక్ మస్తాన్‌వలి పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలో బుధవారం నుంచి పాఠశాలల వారీగా ప్రారంభించిన జగనన్న విద్యా కానుక నాల్గో కిట్ల పంపిణీ నేటితో ప్రతి పాఠశాలకు పంపిణీ పూర్తయిందన్నారు. ప్రతి పాఠశాల ప్రధానోపాధ్యాయులు జూన్ 11వ నాటికి తరగతి వారీగా విద్యార్థి వారీగా జగనన్న విద్యా కానుక కిట్లను గ్రేడింగ్ చేసుకుని జూన్ 12 నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కాబోతున్నందున ప్రతి విద్యార్థికి అందజేయాలన్నారు. కార్యక్రమంలో మండల సిఆర్‌పిలు, ఉదయగిరి మండల విద్యాశాఖ అధికారి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'ఆనం' అర్ధరహిత విమర్శలు మానుకోవాలి

ప్రజాశక్తి ఆత్మకూరు అర్బన్

నాలుగేళ్ల పాటు అధికారం అనుభవించి తమ స్వలాభం కోసం పార్టీని వీడుతూ ప్రభుత్వంపై పార్టీపై మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అర్ధరహిత విమర్శలు చేస్తున్నారని, ఈ మాటలు ఆయన స్థాయిని దిగజార్చే విధంగా ఉన్నాయని వైసిపి నాయకులు పేర్కొన్నారు.గురువారం ఆత్మకూరులోని ఎమ్మెల్యే మేకపాటి క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తాను అధికారం చేపట్టిన నాటి నుంచి అభివద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు అందచేస్తున్నారన్నారు. అలాంటి ముఖ్యమంత్రి పాలనను విమర్శించడం తగదన్నారు.సిమెంటు రోడ్లు, డ్రెయినేజీలు ఏర్పాటు చేసి చెప్పినంత మాత్రాన అభివద్ధి కాదని, తాము కూడా గత నాలుగు సంవత్సరాల కాలంలో అనేక రోడ్ల నిర్మాణాలు చేపట్టామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరగకుండా సచివాలయ వ్యవస్థతో ప్రజల కష్టాలను దూరం చేశారన్నారు. సంక్షేమ పథకాలను అందించడం వారి భవిష్యత్తుకు పెట్టుబడి లాంటిదని, ఇది వథా ఖర్చు ఎలా అవుతుందని ప్రశ్నించారు.గత ప్రభుత్వం ప్రకటించిన మెనిఫెస్టోలో ఏ ఒక్క హామీని పూర్తి స్థాయిలో అమలు చేశారా అని ప్రశ్నించారు. రైతు సోదరుల కోసం ప్రకటించిన రుణమాఫీ, 25 వేల ఉద్యోగాలు ఇలా చెప్పుకుంటూ పోతే మీరు పూర్తిగా అమలు చేసిన హామీలేమిటో ప్రజలకు వివరించాలన్నారు. ఫించన్ తీసుకోవాలంటే జన్మభూమి కమిటీలో ఉన్న ప్రతి ఒక్కరికీ ఆ వ్యక్తి నచ్చితేనే పెన్షన్ మంజూరయ్యేదని, ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయ, వాలంటీర్ల వ్యవస్థలతో ఇలాంటి పరిస్థితి లేదన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పెన్షన్ మంజూరు చేయడం జరిగిందని వివరించారు. పట్టాదారు పాస్ పుస్తకాలు సైతం గ్రామాల్లో రైతులు పొంద గలుగుతున్నారని ఇదంతా అభివద్ధి కాదా అని ప్రశ్నించారు.ప్రతిపక్ష పార్టీలు అధికారులు ప్రస్తుత ప్రభుత్వంపై ఇచ్చిన హామీలు నెరవేర్చ లేదని కినుక వహించారని అంటున్నారని, నిన్న జరిగిన కేబినెట్ సమావేశంలో ఉద్యోగులందరికి న్యాయం చేశారన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల జీవితాల్లో సైతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వెలుగులు నింపారన్నారు.పార్టీలో పదవులు రాలేదని, మంత్రులు పదవులు ఇవ్వలేదని ఇలా ప్రభుత్వంపై విమర్శలు చేయడం తగదన్నారు. వెంకటగిరిలో మీకు సీటు ఇచ్చే సమయంలో బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి అక్కడ ఇన్‌ఛార్జిగా ఉన్నారని, కానీ మీ పెద్దరికాన్ని గుర్తించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మీకు సీటు ఇచ్చారన్నారు. గతంలో కీర్తిశేషులు ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి రెండుసార్లు సీటు అందించారని ఆ విషయాలన్ని గుర్తుంచు కోవాలన్నారు. పార్టీ మారిన ప్రతిసారి ముఖ్యమంత్రులను విమర్శించడం సరికాదన్నారు.ఆత్మకూరు నియోజకవర్గంలో అభివద్ధి జరగలేదని మీరంటున్నారని, కీర్తిశేషులు మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో సీఎస్ఆర్ నిధుల ద్వారా ఆదాని వాటర్ ప్లాంట్ ఆత్మకూరుకు తీసుకొచ్చారన్నారు. ఎంఎస్ఎంఈ పార్కు స్థాపించారని, ఆయన హఠాన్మరణంతో ఆయన స్థానంలో ఎమ్మెల్యేగా వచ్చిన ఆయన సోదరుడు మేకపాటి విక్రమ్ రెడ్డి సైతం ఆత్మకూరు నియోజకవర్గాన్ని అభివద్ధిలోకి నడిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారని తెలిపారు.ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం ఏర్పాటు ద్వారా సొంత నిధులతో అనేక అభివద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని, నియోజకవర్గ కేంద్రంలో బస్టాండ్ నిర్మాణంతో పాటు పలు పాఠశాలల్లో డిజిటల్ క్లాస్ రూంల ఏర్పాటు చేస్తున్నారన్నారు. భవిష్యత్తులో మరెన్నో అభివద్ధి పనులు ఏడీఎఫ్ ద్వారా చేపట్టనున్నట్లు వివరించారు. ఆత్మకూరును పారిశ్రామికంగా అభివద్ధి చేసేందుకు మా శాసనసభ్యులు మేకపాటి విక్రమ్ రెడ్డి శాయశక్తులా కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఆత్మ కూరు మండల పరిషత్ అధ్యక్షుడు కేతా వేణుగోపాల్ రెడ్డి, వల్లభనేని రాజేంద్ర, వాశిపల్లి లక్ష్మిరెడ్డి, సర్పంచ్ బొలిగర్ల వెంకటేశ్వర్లు, నాయకులు సానా వేణుగోపాల్ రెడ్డి, బొమ్మిరెడ్డి రవికుమార్ రెడ్డి, బొడ్డు గిరినాయుడు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైసిపి నాయకులు

మట్టి నమూనా పరీక్షలు తప్పనిసరి

ప్రజాశక్తి-ఉదయగిరి

ప్రతి రైతూ మట్టి నమూనా పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని డిడిఏ శివ నారాయణ తెలిపారు. విఎల సామర్థ్యాల పెంపు పై శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా వనరుల కేంద్రం డిడిఏ శివ నారాయణ, ఏడిఏ లక్ష్మీ మాధవి, జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం విషయ నిపుణులు పంటల ఉత్పత్తి విభాగం డా. కె. కిరణ్ కుమార్ రెడ్డి శిక్షణ ఇచ్చారు. గురువారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఇన్‌ఛార్జ్ ఏడిఏ చెన్నారెడ్డి అధ్యక్షతన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు అధిక రసాయనాలు వాడుట వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, పొలంబడి ఎరువుల యాజమాన్యం కలుపు నివారణ చర్యలు, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ప్రతి రైతు పంట వేసే ముందు తప్పనిసరిగా మట్టి నమూనా పరీక్షలు పరీక్షించినప్పుడే అధిక లాభాలు ఆశించవచ్చని రైతులను కోరారు. అధిక రసాయనాలు వాడటం వల్ల ప్రజలు పెద్ద ప్రమాదంలో చిక్కుకొని ఉన్నారని అది కనపడకుండా పిల్లలు కలగకపోవడం, పిల్లలు బలహీనంగా పుట్టడం బుద్ధి మాన్యత తగ్గడం త్వరగా మాట్లాడలేకపోవడం ఈ అధిక రసాయనాల వాడడం వల్ల పిల్లల్లో ఇవి కనపడుతున్నాయన్నారు. ఆరోగ్యమైన ఆహారం తినడం మంచిది కనుక సంపూర్ణ పోషకాలు గల ఆహారాన్ని రైతులు పండించేలా చూడడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఈ రకంగా పురుగుమందులేని వ్యవసాయాన్ని రైతు పండించేందుకు సిద్ధం చేయుటకు మనం అవగాహన కల్పించి పంటను సాగు చేసేందుకు ప్రతి గ్రామమును సందర్శించి రైతులను గుర్తించాలన్నారు. 30 మంది రైతులను గుర్తించి సంపూర్ణ ఆరోగ్య పంటపై అవగాహన కల్పించి పంటను వేయించాలన్నారు. పంచాయతీలో ప్రతి రైతు చూసే విధంగా ఒక రైతు పంటను ఎంపిక చేయాలన్నారు. ఈ ఎంపిక రైతు పంటను చూసే విధంగా వేసే పంటపై అవగాహన కల్పిస్తూ సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో శైలజ కుమారి, ఐదు మండలాల ఏవోలు, విఏఏ లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిడిఎ

వాలీబాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండలం జువ్వల దిన్నె పంచాయతీ అలిచర్ల బంగారు పాలెంలో ఆంతర్ జిల్లా వాలీబాల్ టోర్న మెంట్ పోటీలు గురువారం కాంద్ర యువ నేస్తం వ్యవస్థాపకులు కాం ద్ర సతీష్ నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య , విజ్ఞానాన్ని నేర్పితే క్రీడలు శారీరక మానసికాభివద్ధికి దోహద పడుతుందని, ప్రతి ఒక్కరూ దుర అలవాట్లకు దూరంగా ఉంటూ తప్పని సరిగా వ్యాయామం చేస్తూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. వాలీ బాల్, టోర్నమెంట్ నిర్వాహకులు జగదీష్, తిరుపతిరావు, వసంతకుమార్, ప్రకాష్ లు మాట్లాడారు.

ఈ నెల 09,10,11తేదీలలో జరుగు పోటీలలో నెల్లూరు, ప్రకాశం జిల్లాల తీర ప్రాంత మత్స్యకారా గ్రామాల నుంచి ఇప్పటి వరకు నలభై టీములు పోటీ పడుతున్నాయన్నారు. పోటీలలో విజేతలకు మొదటి బహుమతి రూ.30వేలు,రెండోవ బహుమతి రూ.20 వేలు ,మూడోవ బహుమతి రూ.15 వేలు, నాల్గవ బహు మతి 10వేలు రూపాయలు నగదుకాంద్రా యువనేస్థం ద్వార అందజేస్తున్నట్లు తెలిపారు.

కార్యక్రమంలో గిరిజన జాగతి వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాపట్ల వెంకట పతి, పీట్ల ప్రత్యూష్ కుమార్, స్థానిక కాపు నాయకులు కొండయ్య, జాలయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిడిఎ జి. శివన్నారాయణ

గ్రామ వ్యవసాయ సహాయకులకు శిక్షణ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్:వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణంలో ఆత్మకూరు అగ్రికల్చర్ డివిజన్ స్థాయి గ్రామ వ్యవసాయ సహాయకులకు ఎంపిఇఒలకు ఏఈ ఓలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా వనరుల కేంద్రం డిడిఎ జి. శివన్నారాయణ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ పంటల సాగులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రైతుల ఆదాయం పెంచడం ఖర్చులు తగ్గించడంలో విఎఎల పాత్ర గురించి వివరించారు. వ్యవసాయ శాఖ ద్వారా అమలవుతున్న పథకాల గురించి వివరించారు. జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు ఏడిఏ లక్ష్మీ మాధవి వ్యవసాయ అధికారి ఈ శైలజ కుమారి, డాక్టర్ వైఎస్ఆర్ పొలంబడి ముఖ్యోద్దేశాలు నిర్వహించుకునే విధానం శిక్షణ తరగతులు గురించి గ్రామ వ్యవసాయ సహాయకులకు శిక్షణ ఇవ్వడం జరిగింది. కషి విజ్ఞాన కేంద్రం (కెవికె) శాస్త్రవేత్త కే కిరణ్ కుమార్ రెడ్డి వివిధ పంటలలో కలుపు నివారణ పద్ధతులకు కలుపు మందుల గురించి వివరించారు.కార్యక్రమంలో ఆత్మకూరు సహాయ వ్యవసాయ సంచాలకులు వి.దేవసేనమ్మ, ఆత్మ కూరు, అనంతసాగరం, ఎఎస్ పేట మండల వ్యవసాయ అధికారులు కిషోర్ బాబు, శ్రీధర్ రెడ్డి, రజిని, మండల గ్రామ వ్యవసాయ సహాయకులు ఎంపీఈఓలు, ఏఈఓలు, పాల్గొన్నారు.

14న వారాహి యాత్ర

ప్రజాశక్తి-కావలి:జనసేన అధినేత పవనకళ్యాణ్ తలపెట్టిన" వారాహి యాత్ర" ఈ నెల 14 న ఉమ్మడి ఉభయగోదావరి జిల్లానుంచి ప్రారంభం అవుతుందని ఈ యాత్రను ఎవరూ ఆపలేరని జనసేన కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ,జిల్లా కార్యదర్శి సమ్మును వెంకటసుబ్బయ్య తెలిపారు. గురువారం వారు పట్టణంలోని జర్నలిస్ట్ క్లబ్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మా అధినేత పవనకళ్యాణ్ తలపెట్టిన వారాహి యాత్ర దిగ్విజయంగా పూర్తికావాలని పట్టణంలోని శ్రీ కళుగోలమ్మ శాంభవి అమ్మవారి దగ్గర పోస్టర్‌ను ఉంచి పూజలు చేసినట్లు తెలిపారు. ఈ యాత్ర దిగ్విజయంగా రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగాలని అమ్మవారిని కోరికి పూజలు చేసినట్లు తెలిపారు. అనంతరం జర్నలిస్ట్ క్లబ్‌లో జనసేన నాయకులతో కలసిపోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ వారాహి రోడ్ల పైకి వస్తుందంటే వైసీపీ నేతలు ఎందుకు భయపడుతున్నారో చెప్పాలన్నారు. వారాహిని అడ్డుకునేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితో సహ అనేక అడ్డంకులు కల్పించి రిజిస్ట్రేషన్ ఆపాలని చూశారన్నారు. రాష్ట్ర ప్రజలకు న్యాయం జరగాలంటే పవనకళ్యాణ్ తోనే సాధ్యం అన్నారు. రాష్ట్రంలో అరాచక దోపిడీ పాలన పోవాలంటే జనసేన అధికారంలోకి రావాలన్నారు. తన సొంత డబ్బులు వెచ్చించి ఏ పదవి ఆశించకుండా ప్రజల తరపున పోరాడుతున్న నాయుకుడు పవనకళ్యాణ్ మాత్రమే అన్నారు. రాబోయే రోజుల్లో పవనకళ్యాణ్ ఈ రాష్ట్రానికి దశ, దిశ కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జనసేన పట్టణ గౌరవ అధ్యక్షులు బెల్లంకొండ వెంకటేశ్వర్లు, నియోజకవర్గ అధికార ప్రతినిధి రుషి కేష్, పట్టణ పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ అధ్యక్షుడు ఆలా శ్రీనాథ్, గుడుపల్లికష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

11న 6వ తరగతి ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని నందవరం ఆదర్శ పాఠశాలలో 6వతరగతిలో ప్రవేశం కోసం జూన్ 11న ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ పి. శ్రీనివాసులు రెడ్డి తెలియ జేశారు. దరఖాస్తుచేసుకున్న విద్యార్థులందరూ ఉదయం 9గంటలకు పాఠశాలకు వచ్చి హాల్ టికెట్ తీసుకొని పరీక్షా కేంద్రానికి చేరుకోవా లన్నారు.పరీక్ష ఉదయం 9నుంచి 12గంటల వరకు జరుగుతుందని పేర్కొన్నారు. మిగతా వివరాలకు పాఠశాల ప్రిన్సిపల్ ను సంప్రదిం చాలని కోరారు.

414పొగాకుబేళ్లు కొనుగోలు

ప్రజాశక్తి-మర్రిపాడు

: మండలంలోని డిసి పల్లి పొగాకు వేలం కేంద్రంలో ఓపెన్ క్లస్టర్ ను నిర్వహించగా రైతులు 427పొగాకు బేళ్లను రైతులువేలం కేంద్రానికి తీసుకొచ్చారు.వీటిలో 414బేళ్లను పలు కంపెనీలకు చెందిన వ్యాపారస్తులు కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 06పొగాకు బేళ్లను తిరస్కరించారు. అధిక బరువుతో ఉన్న 07పొగాకు బేళ్లను వేలానికి తిరస్కరించారు. వీటిలో ఎన్ఎస్ 05ఎన్ బి 01ఉన్నాయి.కిలో పొగాకు గరిష్ట ధర 212 రూపాయలు కాగా కనిష్ఠ ధర 170 రూపాయలు. సగటు ధర 207.13నమోదు కాగా, వేలం లో 12మంది కంపెనీ వ్యాపా రస్తులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు.

ఆహార పొట్లాలు అందజేస్తున్న దాత

ఆహారపొట్లాలు అందజేత

ప్రజాశక్తి-కావలి

పట్టణం నివాసులు కందికట్టు నారాయణ వారి వదినమ్మ కీ.శే.కందికట్టు. స్వర్ణలత(జ్యోతి)జ్ఞాపకార్థంగా గురువారం సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర ద్వారా తుపాన్ నగర్లోని పేద పిల్లలకు భోజనం ప్యాకెట్లు వితరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ నారాయణ వారి వదినమ్మ పేరుపై పేద పిల్లలకు ఆకలి తీర్చడం సంతోషంగా ఉందని తెలిపారు.ఈ సందర్భంగా నారాయణకి ధన్యవాదాలు తెలిపారు..

బహుమతులు అందజేస్తున్న దృశ్యం

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-ఎఎస్‌పేట:స్థానిక గ్రంథాలయంలో మే 8వ తేదీ నుంచి సమ్మర్ క్యాంప్ నిర్వహించి పిల్లలకు వివిధ కత్యాలలో శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా పిల్లలచే కథలు చెప్పించడం, పుస్తక పఠనం, పాటలు నత్యాలు తదితర అంశాలపై పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల హిందూ ప్రధానో పాధ్యాయులకు కే.సి. రాగయ్య బహుమతులు అందజేశారు. ఈ సమ్మర్ క్యాంప్ విజయవంతం చేయడానికి సహకరించిన ప్రధానోపాధ్యాయులు కేసి రాగయ్యకు లైబ్రేరియన్ శ్రీనివాసరాజు శాలువా పూలమాలతో సత్కరించారు. ఈ వేసవి శిబిరాలు పిల్లలకు వినోదంతో పాటు విజ్ఞానాన్ని అందిం చిందని ప్రధానోపాధ్యాయులు అభిప్రా యపడ్డారు. కార్యక్రమంలో నాణేల సేకరణ కర్త ఎండి వాయిస్, గ్రంథాలయ పాఠకులు, తదితరులు పాల్గొన్నారు.

సదస్సులను సద్వినియోగపరచుకోండి

ప్రజాశక్తి-ఎఎస్‌పేట:కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాలలో రెవెన్యూ సమస్యలు తక్షణ పరిష్కారం కోసం నిర్వహించే రెవెన్యూ సదస్సులను ఆయా గ్రామాల ప్రజలు అర్జీల రూపంలో ఇచ్చి సద్వినియోగ పరుచుకోవాలని తహశీల్దార్ ఏ.వి. రమణారావు తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను మండల ప్రజలు గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సులో అర్జీల రూపంలో ఇచ్చి తక్షణమే సమ స్యలను పరిష్కరించుకోవాలన్నారు. మండలంలో ఎక్కువ శాతం సదాబైనమాలు ఉన్నాయని అవేకాక ఎలాంటి రెవెన్యూ సమస్యలున్న అర్జీల రూపంలో ఇవ్వాలన్నారు. ప్రతి సోమవారం మండల తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించే జగనన్నకు చెబుదాం "స్పందన" కార్యక్రమం ద్వారా సమస్యలను తెలుపవచ్చన్నారు. శుక్రవారం అనుమ సముద్రం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించను న్నట్లు తెలిపారు.

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-కావలి:జిల్లా పరిధిలో 10వ తరగతి నుంచి బి టెక్ వరకు 80శాతం మార్కులతో పాస్ అయిన బలిజ విద్యార్థుల నుంచచి స్కాలర్ షిప్ ల కోసం కావలి బలిజ - కాపు సంక్షేమ సంఘం దరఖాస్తులను ఆహ్వాని చ్చింది.10వ తరగతి, ఇంటర్ పాస్ అయిన వారికి రూ.2వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.2,500, బి టెక్ విద్యార్థులకు రూ.5వేలు ప్రతిభా పురస్కారాలు అందించ బడునని తెలిపారు. దరఖాస్తులకు మొబైల్ :9652967025, 9390967477లను సంప్రదిం చాలని బలిజ -కాపు సంక్షేమ సంఘం అధ్యక్షులు తోట వెంకట శేషయ్య తెలియజేశారు.

నిందితుడి అరెస్ట్

ప్రజాశక్తి-వరికుంటపాడు:మండలంలోని గొల్లపల్లి ఎస్‌టి కాలనీ బస్టాండ్ కూడలిలో వైఎస్ఆర్ విగ్రహం ధ్వంసం కేసులో నిందితులుగా పేర్కొన్న లోకసాని రవిని అరెస్టు చేసినట్టు గురువారం ఎస్ఐ విజయ్ శ్రీనివాస్ తెలిపారు. అదే కేసులో రెండవ నిందితుడిగా పేర్కొనబడిన దీనారపు రమణయ్య పరారీలో ఉన్నాడు. ఆయన కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

నట్టల నివారణకు మందులు పంపిణీ

ప్రజాశక్తి-వరికుంటపాడు:ఈనెల 16 నుంచి 25 వరకు పశుసంవర్ధక శాఖ ద్వారా సన్న జీవాలైన గొర్రెలు మేకలకు నట్టల నివారణ మందులు ఉచితంగా పంపిణీ చేస్తామని గురువారం పశువైద్యులు డాక్టర్ రాఘవేంద్ర శర్మ అన్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల పశుపోషకులు అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని సూచించారు.

9,10తేదీల్లో ఉచిత శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-కలిగిరి: స్థానిక ఏపీ మోడల్ స్కూల్లో 11వ తేదీ ఆదివారం జరగబోవు ప్రవేశ పరీక్షకు విద్యార్థులను సన్నద్ధం చేసేదానికి 9,10 తేదీల్లో విద్యార్థులకు ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని ప్రిన్సిపల్ ఏ.శ్రీను తెలియ జేశారు. 6వ తరగతి పరీక్ష రాసే విద్యార్థులు తమ వెంట 5వ తరగతి పాఠ్య పుస్తకాలను ఒక నోట్ బుక్ తెచ్చుకోవాలని తెలియజేశారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు

ప్రజాశక్తి-కొడవలూరు :మండలంలోని నాయుడుపాలెం నూతనంగా నిర్మించిన కోదండరామ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు గురువారం వేడుకగా ఆరంభమయ్యాయి. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాతలు మారం రెడ్డి నారసింహారెడ్డి, సుజాతమ్మ, మారం రెడ్డి శేషారెడ్డి, వర్షిణి, విష్ణుప్రియలు పాల్గొన్నారు.

డాక్యుమెంటు పోయినది

అప్పాని వెంకటేశు, తండ్రి **ముసలయ్య,** డోర్ నెం. 26-6-332, వరలక్ష్మి హోమ్స్, గోమతినగర్, నెల్లూరు సిటీ, నేను **తేది: 3-6-2023** న నా **ఒరిజినల్ రిజిష్టరు దాక్యుమెంటు నెం.233/2013** పెద్ద పోస్టు ఆఫీసు దగ్గర జెరాక్స్ తీసుకొని చిన్నబజారుకు మోటారు బైక్‌లో పోవు చుండగా మార్గమధ్యలో జారి పడిపోయినది. ఈ ఒరిజినల్ రిజిష్టరు డాక్యుమెంటు ఎవ్వరికైనా దొరికినయెడల ఈ క్రింది అడ్రస్సుకు తెలిపి తగిన పారితోషికం పొందగలరు.

అప్పాని వెంకటేశు, తండ్రి **ముసలయ్య**
డోర్ నెం. 26-6-332 రు, వరలక్ష్మి హోమ్స్,
గోమతి నగర్, నెల్లూరు సిటీ. సెల్: **63003 24626**

In The Court of the Senior Civil Judge : Gudur
S.O.P.No. 28 / 2023

In The Matter of The Estate of The Deceased **Badabagni Nagendra,** resident at Atmakur Post & Mandal, SPSR Nellore District.
Badabagni Sanjeevamma, W/o **B.Nageswar Rao,** residing at Jagannada Rao peta, Atmakur Post & Mandal, SPSR Nellore District. - Petitioner
Vs
1. **Badabagni Kesava Vardhini,** W/o Late **Badabagni Nagendra,** residing at Proddutur, R.R. Apartment Kalavakatta Street, Gopavaram Post and Mandal, YSR Kadapa District.
2. **Badabagni Akshaya,** D/o Late **Badabagni Nagendra,** 2nd Respondent herein being minor rep.by her mother as natural guardian **Badabagni Kesava Vardhini,** i.e., 1st Respondent herein - Respondents

జనరల్ నోటీసు

పై నెంబరున పిటిషనరుకు కుమారుడైన బడభాగ్ని నాగేంద్ర గారు సోమశిల సువర్ణముఖి లెవల్ కెనాల్‌లో పనిచేస్తూ **తే02-12-2021**దిన చనిపోయినందున ఆయనకు రావలసిన **డెత్ బెనిఫిట్స్, ఇన్సూరెన్స్ పాలసీల అమౌంట్** మరియు వగైరాలు తీసుకొనుటకు గాను వారసత్వపు సర్టిఫికేట్ మంజూరు చేయమని కోరుతూ పై పిటిషనరు పైతెలిపిన కోర్టులో **S.O.P.No. 28/2023** రు దాఖలు చేసియున్నందున, సదరు పిటిషన్‌పై ఎవ్వరికైనను ఆక్షేపణలు ఉన్నయెడల **తే13-06-2023**దిన ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పైతెలిపిన కోర్టులోహాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినదని యిందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.

షేక్.నన్నేసాహెబ్, బి.కాం., బి.ఎల్.,
పిటిషనరు తరపు అడ్వకేట్, నెల్లూరు.

మహారాజశ్రీ నెల్లూరు 3వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
I.A.No. 513/2021
O.S.No. 89/2018

1. **సుబ్బుసింగ్ గౌరి శంకర్ సింగ్**
మరియు ఇతరులు - పిటిషనర్స్ / వాదులు
Vs
1. **మల్లవరపు సుబ్బారెడ్డి**
మరియు ఇతరులు - రెస్పాండెంట్స్

నోటీసు

To,
R64. Dr. **శ్రీరామ్ నీరజ,** W/o **సురేష్ కుమార్,** ఫ్లాట్ నెం.150, గ్రౌండ్ ఫ్లోర్, పెనుసిల ప్యారడైజ్, సింహపురి హాస్పిటల్ రోడ్డు, వేదాయపాళెం, నెల్లూరు-4.

పై నెంబరు పిటిషన్‌ను పై నెంబరు కేసులో పై తెలిపిన పిటిషనర్‌లు మిమ్మల్ని మరియు ఇతరులను Dr. **శ్రీరామ్ రామసుబ్బయ్య** గారి వారసులుగా తీర్మానించమని కోరుతూ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్ మీ నోటీసు నిమిత్తం తే19-06-2023 దికి వాయిదా అయివున్నది. కావున ఆరోజు ఉదయం 10:30 ని॥లకు మీరు స్వయంగా కానీ లేదా మీ వకీలు ద్వారా కానీ పై కోర్టులో హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనియెడల సదరు పిటిషన్ మీ పరోక్షమున తీర్మానించబడును.

యస్. శ్రీనివాసమూర్తి, బి.ఎ., బి.ఎల్.,
పిటిషనర్స్ తరపు అడ్వకేట్, నెల్లూరు.

CHANGE OF NAME

GUDDETI TIRUPALAMMA @ POLUDASU TIRUPALAMMA, W/o Late **POLUDASU VIJAYA KUMAR** (Old Name), R/o.D.No. 26-2-1711, Mahalakshmi Complex Back Side, Simhapuri Centre, Vedayapalem, A.K.Nagar Post, Nellore-4, shall henceforth be known as **POLUDASU TRIVENI** (New Name) as Published by Authority, The Andhra Pradesh Gazette, Part II Extraordinary, Amaravati, Monday, May 8, 2023.